విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

విశాలాంధ్ర-ఏలూరు: సచివాలయానికి వచ్చే ప్రజల అవసరాలను, సమస్యలను ఓపిగ్గా విని మీ స్థాయిలో చేయగలిగింది చేయాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ పంచాయతీ కార్యదర్శులకు హితవు పలికారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన గ్రేడ్-1 నుంచి గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శులు 821 మందికి నాలుగు బ్యాచులు గా ఆరు అంశాలపై నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనమంతా ప్రజా సేవకులమనే విషయాన్ని మరవకుండా మన దగ్గరికి వచ్చే ప్రజలు వారి సమస్య చెప్పేదాకా ఓపిగ్గా వినాలన్నారు. సచివాలయంలో మీస్థాయిలో చేయగలిగింది చేయాలని కాని పక్షంలో సంబంధిత తహశీల్దారు, డిఎల్ డిఓ, ఆర్డిఓలను కలువమని చెప్పవచ్చన్నారు. సచివాలయ సిబ్బంది అందుబాటులో లేరనే మాట రాకూడదని ఆయన స్పష్టం చేశారు. స్పందనలో ఎక్కువగా పారిశుధ్యం, ఆక్రమణలుపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తుంటాయన్నారు. ఈ దృష్ట్యా ఆక్రమణలకు సంబంధించి అనుసరించాల్సిన అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన 821 మంది పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 29 నుండి వచ్చేనెల 30 వరకు శిక్షణ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏలూరు జిల్లాకు చెందిన 423 మంది, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన 350 మంది శిక్షణలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, శిక్షణా కో-ఆర్డినేటర్ ప్రసంగిరాజు, డిఎల్ డిఓ మరియు కో-ఆర్డినేటర్ శిరీషా, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపుపై నిరసన

విశాలాంధ్ర-తణుకు: రాష్ట్రంలో జరుగుతున్న ఇసుక అక్రమ మైనింగ్ పై సిద్ధాంతం జాతీయ రహదారి పక్కన అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక ర్యాంపు వద్ద మంగళవారం ఇసుక సత్యాగ్రహ నిరసన కార్యక్ర మంలో తణుకు నియోజకవర్గ తెదేపా మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇసుక రీచ్ లనుంచి వేలాది లారీ ల ఇసుక నిత్యం ఇతరరాష్ట్రాలకు తరలిపోతున్నదని తెలిపారు. జేపీ వెంచర్స్ సంస్థ ముసుగులో జగన్‌రెడ్డి గ్యాంగే ఇసుకదోపిడీకి పాడుతున్నారని విమర్శిం చారు. టీడీపీ ప్రభుత్వంలో ఇసుక ఉచితంగా ప్రజలకు అందిస్తే, అదే ఇసుక ఇప్పుడు బంగారంతో సమానంగా మారిందన్నారు.జగన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మూడుసార్లు ఇసుక పాలసీ మార్చారని అన్నారు.ఒక్కో ప్రాంతంలోని రీచ్ లో ఒక్కోధర నిర్ణయించి, సామాన్యులకు ఇసుక దొరక్కుండా చేస్తున్నది నిజంకాదా? అని ప్రశ్నించారు. ఆయన వెంట తణుకు నియోజకవర్గం తెదేపా నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు ఉన్నారు.

జనసేనను గెలిపించండి

విశాలాంధ్ర-ఉండి: రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీని గెలిపించి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు కోరారు. ఉండి మండలం ఉండి గ్రామంలో మంగళ వారం జనసేన ఉండి మండల పార్టీ అధ్యక్షులు యడవల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జనంలోకి జనసేన ఇంటింటికి జనసేన అనే కార్యక్రమం రెండవ రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు పార్టీ నాయకులు కార్యకర్తలతో ఇంటింటికి తిరిగి పార్టీ సిద్ధాంతాలను ఆశయాలను గాజు గ్లాసు చూపించి జనసేన మేనిఫెస్టో కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గవర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

విశాలాంధ్ర - లింగపాలెం : వ్యక్తి వికాసానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని పలువురు పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా లింగపాలెం మండలంలోని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడలపై అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థికి విద్య ఎంత ముఖ్యమో క్రీడలు అంతే ముఖ్యమని అన్నారు. క్రీడలు వల్ల క్రమశిక్షణ అలవడుతుందని, దేహదారుడ్యం ఉంటుందని వివరించారు. క్రీడలను నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. ఎందరో క్రీడా ప్రతిభ కలిగిన విద్యార్థులు ఉన్నారని, ఈ ప్రతిభ వెలుగులోకి రావాలని అన్నారు. మనదేశంలో క్రీడా ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ధర్మాజీగూడెం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బి.వి.ఎస్.ఎన్.రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు మంగతాయారు ఆధ్వర్యంలో విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని తెలుపుతూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతీ పాఠశాలలో విద్యార్థులతో యోగా చేయించారు.

తెలుగు భాషకు సాటిలేదు

విశాలాంధ్ర - లింగపాలెం : తెలుగు భాష గొప్పతనం ప్రపంచ వ్యాప్తంగా ఉందని తెలుగు పండి తులు, కవి, రచయిత లక్కపాం ప్రకాశరావు అన్నారు. ధర్మాజీ గూడెం ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషకు వెలకట్టలేమని పేర్కొన్నారు. తెలుగు గ్రాంధికాన్ని వ్యవహారిక భాషగా మార్చిన ఘనుడు గిడుగు రామమూర్తి పంతులు గొప్పతనం మరువలేనిదని అన్నారు. ఎన్ని భాషలున్నా తెలుగు భాషకు ఎనలేని గౌరవం ఉందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, కవిత కథలు, పద్యాల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు బి.వి.ఎస్.ఎన్.రాజు, ఇతర ఉపాధ్యాయులు లక్ష్మీచైతన్య, కె.సూరినారా యణ, సునీత తదితరులు పాల్గొన్నారు. ధర్మాజీగూడెం శ్రీవిద్య పాఠశాలలో జరిగిన తెలుగుభాష దినోత్సవ కార్యక్రమంలో తెలుగు పండిట్, కవి, రచయిత అయిన లక్కపాం ప్రకాశరావును పాఠశాల కరస్పాండెంట్ చలసాని రత్నాకర్, సిబ్బంది సన్మానించారు.

భీమవరంలో ఆహా క్యాంటీన్లు



విశాలాంధ్ర -భీమవరం టౌన్: శుచి, రుచికరమైన ఆహారాన్ని ఇంటి వద్దే వండి తక్కువ ధరకే నాణ్యమైన ఆహారాన్ని అందిం చేందుకు ముఖ్య మంత్రి జగన్ ఆహా క్యాంటీన్లను పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మావుళ్ళమ్మ గుడి ప్రక్కన మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆహా క్యాంటీన్ ను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులచే ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, తద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. శ్యామల, మెప్మా అధికారులు నాని బాబు, శాంతి కుమారి, జై కృష్ణ, కృపామణి తదితరులు పాల్గొన్నారు.

అరకొర జీతాలు...అందులోనే పరికరాల కొనుగోలు

- పారిశుధ్య కార్మికుల జీవితాల్లో అలముకున్న చీకట్లు
- నేడు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు: పారిశుధ్య కార్మికులు చేసే పనులు ఎవరూ చేయలేరు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ కార్మికులు పనిచేసే తీరు వెలకట్టలేనిది. రాష్ట్రంలో మొత్తం 89 పురపాలక సంఘాలు, 29 నగర పాలక సంస్థలు,38 నగర పంచాయతీలలో పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులు 52 వేలమంది పనిచేస్తున్నారు. నిబంధనల ప్రకారం నివాస ప్రాంతాలలో ప్రతి 250 ఇళ్లకు ముగ్గురు చొప్పున కార్మికులు పనులు చేపట్టాలి. ఖాళీలు భర్తీ చేయకపోవడం, అదనపు నియామకాలు చేపట్టకపోవడంతో 400 నుండి 500 ఇళ్లకు ఒకే కార్మికుడు పనిచేయాల్సిన దుస్థితి ఉంది.

పరికరాలు లేవు...పారిశుధ్య కార్మికులకు ఏడాదికి రెండు జతల దుస్తులు, జత చెప్పులు, సబ్బులు, మూడు నెలలకు ఒక్కో కార్మికుడికి 100 గ్రాముల కొబ్బరినూనె సరఫరా చేయాలి. ఒక్కో కార్మికునికి నెలకు రెండు జతల గ్లౌజులు , 15 మాస్కులు ఇవ్వాలి. అవసరానికి తగిన విధంగా చీపుర్లు సరఫరా చేయాలి. వీటిలో కొన్ని అరకొరగా ఇస్తుండగా, మరికొన్ని సకాలంలో అందడం లేదు.

అదనపు కార్మికుల ఊసే లేదు...పరిసరాల గ్రామాల విలీనంతో మున్సిపాలిటీ, నగరపాలక సంస్థలు విస్తీర్ణం పెరుగుతోంది. అదే స్థాయిలో పారిశుధ్య కార్మికుల సంఖ్య పెరగడం లేదు. ఉన్న వారిపైనే అదనపు భారం పడుతున్నది. నగర పాలక సంస్థలలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. జిల్లా వ్యాప్తంగా అదనపు పారిశుధ్య కార్మికుల అవసరం ఉంది. కార్మిక సంఘాలు ఎన్నిసార్లు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

ఆప్కాస్‌లో చేర్చారు... సంక్షేమ పథకాలు తీసేశారు... కోవిడ్ సమయంలో కార్మికులకు వేతనానికి అదనంగా నెలకు రూ.6 వెల చొప్పున అందిస్తున్న హెల్త్ అలవెన్స్ కొంతమంది పారిశుధ్య కార్మికులకు ఆప్కాస్ పరిధిలో చేరలేదనే కారణంతో హెల్త్ అలవెన్స్ ఇవ్వడం లేదు. ఆప్కాస్ చేరిన కార్మికులకు ఉద్యోగ విరమణ చేశాక ఎలాంటి ప్రయోజనాలు కల్పించడం లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు లేవు. ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల సందర్భంగా సమాన పనికి సమాన వేతనం ఇస్తామని, ఔట్సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరణ చేస్తానని వాగ్దానం చేసి పారిశుధ్య కార్మికులను నిర్లక్ష్యం చేశారు. నెలకు రూ.18 వేలకు జీతం పెంచుతున్నామని ముఖ్యమంత్రి జగన్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. కానీ అందులో జీతం రూ.12వేలు మాత్రమే. హెల్త్ అలవెన్స్ క్రింద రూ.6 వేలు ఇస్తున్నారు. 11వ పిఆర్సి అమలులోకి వచ్చాక జీతం రూ.12 నుండి 15 వేలకు పెరిగిన పెరిగిన ధరలతో పోల్చి చూస్తే ఇది చాలా తక్కువ. మున్సిపల్ కార్మికుల అవస్థలు, పడుతున్న ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని జిల్లాల విభజన నేపథ్యంలో ఏలూరులో జరుగుతున్న ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రథమ మహాసభలో కార్యాచరణ రూపొందిస్తానికి మున్సిపల్ కార్మికులు సిద్ధం అవుతున్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించాలి
భజంత్రీ శ్రీనివాస్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

అపరిశుభ్ర వాతావరణ పరిస్థితులలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరిస్తానన్న హామీ నిలబెట్టుకోవాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారానికి ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభలో కార్యాచరణ రూపొందించి ఉద్యమాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు.

రాజధాని లేని రాష్ట్రంగా చేసిన ఘనుడు జగన్
సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: దేశంలోనే రాజధాని లేని రాష్ట్రంగా చేసిన ఘనుడు ముఖ్యమంత్రి జగన్ అని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య విమర్శిం చారు. కొయ్యలగూడెం మండలం రాజవరం గ్రామంలో సిపిఐ శాఖ సమావేశం ఎర్రావుల గాంధీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద, బడుగు, బలహీన వర్గాల వారి అభ్యున్నతి కుంటిపడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పంట సాగు చేసుకోవడానికి నీరు అందించాలంటే పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టు పనులను మధ్యలోనే నిలిపివేసి ఆంధ్ర రాష్ట్ర ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేశారన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పేదల జీవితాలు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇప్పించిన ఘనత సిపిఐ దేనని కృష్ణ చైతన్య పేర్కొన్నారు. రాష్ట్రంలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జె.వి రమణ రాజు,వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు కుంచే వసంతరావు, ఉపాధ్యక్షులు బాలయేసు, సీనియర్ నాయకులు దుగ్గిరాల నారాయణరావు, రెలా నరసింహ రావు, కోన రాంబాబు, షేక్ బాబా, వాగు వెంకటరత్నం, ముక్కయ్య, శేషారావు, జుత్తు క లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మానవత సంస్థకు రూ. 50 వేల విరాళం

విశాలాంధ్ర - లింగపాలెం : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలను కొనియాడుతూ మఠం గూడెంకు చెందిన జాస్తి కన్నయ్య చౌదరి, లక్ష్మీ దంపతులు మఠంగూడెం సొసైటీ మాజీ అధ్యక్షులు మండలపు వరప్రసాద్ (బాబు) రూ. 25 వేలు చొప్పున విరాళం అందించారు. మానవత సేవా సంస్థలో వీరు సభ్యులుగా చేరారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో లింగపాలెం మండలంలో యూనిట్‌ను త్వరలో ప్రారంభిస్తున్నట్టు సంస్థ కన్వీనర్ బలుసు సత్యనారాయణ తెలిపారు. ఈ సంస్థ పార్థీవదేహాలకు ఉచితంగా ఫ్రీజరు, దహన సంస్కారాలు చేసేందుకు వాహన సదుపాయం కల్పిస్తుందని తెలిపారు. మఠంగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి అడుసుమిల్లి నిర్మల, మోహిని, అమరవాణి తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువులో పడి యువకుడి మృతి

విశాలాంధ్ర-భీమడోలు: ఆగడాలలంక గ్రామానికి చెందిన వెంప సర్జన్ బాబు (17) పశువుల మేత కొరకు గ్రామంలోని చెరువు పై ఉన్న పడవపై పచ్చగడ్డి కోయడానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి సోమవారం మధ్యాహ్నం గల్లంతయ్యాడు గ్రామస్తులు ఎంత వెతికినా దొరకపోవడంతో మంగళవారం పోలీసులు, ఫైర్ సిబ్బంది గజ ఈతగాళ్లతో చెరువు మొత్తం గాలించడంతో సర్జన్ మృతదేహాన్ని ఎట్టకేలకు బయటికి తీశారు. కేసు నమోదు చేసిన భీమడోలు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేసేది టీడీపీ ప్రభుత్వమే - నారా లోకేష్

విశాలాంధ్ర-టి.నరసాపురం: తెలుగు దేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పాదయాత్ర లో భాగంగా శ్రీరామ వరం గ్రామంలో మధ్యాహ్న భోజన విడిది కేంద్రం వద్ద పోలవరం నిర్వాసితు లతో ముఖాముఖి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నిర్వాసితులు పలు సమస్యలు లోకేష్ దృష్టికి తీసుకు వచ్చారు.ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులు పరుగులు తీస్తూ 72శాతం పూర్తయ్యాయని అన్నారు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో రూ. 1లక్షా15 నుండి లక్షా 70వేలు ఇస్తే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ. 6.36లక్షలు పరిహారం నిర్వాసితులకు అందించారని తెలిపారు. జగన్ నాలుగేళ్ల పాలనలో కేవలం 4శాతం మాత్రమే పనులు చేశారని, వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, పోలవరాన్ని పూర్తి చేసేది చంద్రబాబు నాయుడేనని అన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రథమ మహాసభ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని నిత్యం పరిరక్షిస్తున్న మున్సిపల్ కార్మికుల హక్కులను సాధించుకోవడం కోసం బుధ, గురు వారాల్లో ఏలూరులో జరిగే ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని జంగారెడ్డిగూడెం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి) గౌరవ అధ్యక్షులు జేవి రమణ రాజు పిలుపునిచ్చారు.మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం సంఘ అధ్యక్షులు కొత్తూరు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన రమణరాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల హక్కులను కాపాడుకోవడానికి మున్సిపల్ కార్మికులు ఉద్యమా లకు సిద్ధం కావాలని అన్నారు.మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య కార్మికులు చేసే సేవలు విలువ కట్టలేనివని, అటువంటి కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తాత్సారం చేయడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ పాదయాత్రలో హామీ ఇచ్చినట్లుగా మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, పనికి తగిన వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మండల కార్యదర్శి కుంచే వసంతరావు, జంగారెడ్డిగూడెం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కూనపాముల విగ్నేష్, కమిటీ సభ్యులు కొత్తూరు శ్రీను ముప్పిడి శ్రీను, చాపల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

విశాలాంధ్ర - ముదినేపల్లి : ఇంధనంతో వెళుతున్న ట్యాంకర్ లారీ ఛిద్రమైన రహదారిలో చిక్కుకోవడంతో ఎట్టకేలకు గ్రావెల్ ఫ్యాక్టరీ యాజమాన్యం రహదారి మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. మండలంలోని పడాలి గ్రామ సెంటర్ వద్ద పూర్తిస్థాయిలో గుంతలు ఏర్పడి గ్రావెల్ లేచి వర్షపు నీటితో నిండి ఉండడంతో వాహనాలు , ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు పల్టీలు కొడుతున్నాయి. ఈ క్రమంలో గ్రావెల్ ఫ్యాక్టరీ యాజమాన్యం గ్రావెల్‌తో రహదారికి మరమ్మత్తులు చేయించారు. ఈ రహదారిని బాగు చేయించాలని స్థానికులు రహదారికి అడ్డంగా నిలబడి నిరసన తెలిపిన సంగతి విదితమే. రహదారికి పనులు చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లోకేష్‌కు మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

విశాలాంధ్ర-నూజివీడు: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యువగళం పాదయాత్ర నూజివీడు వచ్చిన సందర్భంగా తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌కు ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (ఏఐటీయూసీ) తరపున సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఇచ్చినట్టు యూనియన్ నాయకులు చాట్ల పుల్లారావు మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగు ణంగా మెస్ ఛార్జీలు పెంచాలని, రూ. 3వేల నుంచి జీతం కనీసం రూ.18వేలు ఇవ్వాలని, వీరికి రాష్ట్ర ప్రభుత్వమే సబ్సిడీ మీద గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. పిఎఫ్ ,ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు, అధికారుల వేధింపులు ఆపాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అనంతరం లోకేష్ సానుకూలంగా స్పందించి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 90 రోజుల్లోనే జీతాలు, మెస్ ఛార్జీలు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు.

లోకేష్‌కు గజమాలతో ఘన స్వాగతం
సమస్యలు వింటూ యువ గళం పాదయాత్ర ముందుకు

విశాలాంధ్ర-టి నరసాపురం: తెలుగు దేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పాదయాత్ర పోలవరం నియోజకవర్గం టి నరసాపురం మండలంలోనికి మంగళవారం ప్రవేశించింది. నాయకులు లోకేష్‌కు గజ మాలతో స్వాగతం పలికారు. గిరిజన సాంప్రదాయ నృత్యాలతో భారీ జన సందోహంతో ప్రారంభ మైన యువ గళం పాదయాత్ర టి నరసాపురం, ఏపిగుంట, శ్రీరామ వరం, తిరుమల దేవిపేట, వెంకటాపురం, బొర్రంపాలెం గ్రామాల వరకు సాగింది. యువ గళం పాదయాత్ర లో లోకేష్ ప్రజా సమస్యలు వింటూ ముందుకు సాగారు.టి నరసాపురం ఏపిగుంటతో పాటు పలు గ్రామాల్లో లోకేష్ ను కలిసి నిమ్మరైతులకు కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని, పామాయిల్ కు గిట్టుబాటు ధర కల్పించాలని, గ్రామాల్లో డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, ఇళ్ళ స్థలాలు కేటాయించి ఇళ్ళు నిర్మించాలని, ఎస్సీలపై అరాచకాలు మహిళలపై దాడులు పెరిగాయని, స్మశాన నాటికలు ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా లోకేష్ స్పందిస్తూ ముఖ్యమంత్రికి వ్యవసాయంపై అవగాహన లేక పోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిమ్మరైతులకు కోల్డ్ స్టోరేజిలు నిర్మిస్తామని, పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటాం అన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజ నేయులు, పోలవరం నియోజక వర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు ఘంటా మురళీ రామకృష్ణ, మీడియం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

చింతలపూడి మారుతీనగర్‌లో శ్రీనివాస ఎన్‌క్లేవ్ ఫ్లాట్ నెం.301లో నివాసము ఉంటున్న **గంధం సాయి రాణి భర్త గంధం రామమోహనరావు S1578691** నెంబరు గల పాస్‌పోర్టు చింతలపూడి పాతబస్టాండులో జిరాక్స్ నిమిత్తం వస్తుండగా మార్గమధ్యంలో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది చిరునామాను సంప్రదించగలరు.

గంధం సాయిరాణి,
భర్త గంధం రామమోహనరావు,
ఫ్లాట్ నెం. 301, శ్రీనివాస ఎన్‌క్లేవ్
మారుతీనగర్, చింతలపూడి-534460.
సెల్ నెం. 9440218631

పాస్‌పోర్టు పోయినది

చింతలపూడి మారుతీనగర్‌లో శ్రీనివాస ఎన్‌క్లేవ్ ఫ్లాట్ నెం. 301లో నివాసము ఉంటున్న **గంధం గణబాల సుబ్రమణ్యం తండ్రి గంధం రామమోహనరావు, S1579135** నెంబరు గల పాస్‌పోర్టు చింతలపూడి పాత బస్టాండులో జిరాక్స్ నిమిత్తం వస్తుండగా మార్గ మధ్యంలో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది చిరునామాను సంప్రదించగలరు.

గంధం గణబాల సుబ్రమణ్యం,
తండ్రి గంధం రామమోహనరావు,
ఫ్లాట్ నెం. 301, శ్రీనివాస ఎన్‌క్లేవ్
మారుతీనగర్, చింతలపూడి - 534460.
సెల్ నెం. 9440218631

పాస్‌పోర్టు పోయినది

చింతలపూడి మారుతీనగర్‌లో శ్రీనివాస ఎన్ క్లేవ్ ఫ్లాట్ నెం. 301లో నివాసము ఉంటున్న **గంధం రామ మోహనరావు, తండ్రి గంధం రామకృష్ణయ్య S1578692** నెంబరు గల పాస్‌పోర్టు చింతల పూడి పాత బస్ స్టాండులో జిరాక్స్ నిమిత్తం వస్తుండగా మార్గ మధ్యంలో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది చిరునామాను సంప్రదించగలరు.

గంధం రామమోహనరావు,
తండ్రి గంధం రామకృష్ణయ్య, ఫ్లాట్ నెం. 301,
శ్రీనివాస ఎన్ క్లేవ్ మారుతీనగర్,
చింతలపూడి - 534460.
సెల్ నెం. 9440218631

ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి విజయాలను స్ఫూర్తిగా పొందాలి
జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: ధ్యాన్ చంద్, గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు నిరంతర కృషి, పట్టుదల, శ్రమ ఫలితాల ద్వారా సాధించిన విజయాల నుండి స్ఫూర్తిని పొందాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు.మంగళవారం స్థానిక స్పందన సమావేశం మందిరంలో ధ్యాన్ చంద్, గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వీరి ఇరువురు చిత్రపటాలకు పూల మాలలు వేసి, పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె. కృష్ణ వేణి, డీఈవో ఆర్. వెంకట రమణ తదితరులు వున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని గిడుగు రామ్మూర్తి అన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినమైన ఆగస్టు 29ను తెలుగు భాషా దినోత్సవంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిగణించిందని తెలిపారు. ఇదే రోజున జన్మించిన సుప్రసిద్ధ భారతీయ హాకీ ఆటగాడు ధ్యాన్ చంద్ పేరిట జాతీయ క్రీడా దినోత్సవం ప్రతి ఏటా జరుపుకుంటున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ లోనే వ్యవహారిక భాషోద్యమానికి మూలపురుషుడు గిడుగు రామ్మూర్తి అన్నారు. గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతోత్సవాలను పురస్కరించుకొని జిల్లాలోని వివిధ పాఠశాలల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఐదుగురు తెలుగు భాషా పండితులకు మెమెంటోలను అందజేశారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె.కృష్ణవేణి, డీఈవో వెంకటరమణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ బి. జాన్సన్, పిఈటి అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ కె. కృష్ణారెడ్డి, సెక్రటరీ ఎండి కొత్తూస్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3తో విలువైన సమాచారం
పూర్వపు ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ వైవిఎన్ కృష్ణమూర్తి

విశాలాంధ్ర -భీమవరం: భారత శాస్త్రవేత్తలు ప్రయోగించిన చంద్రయాన్-3 ప్రయోగంతో ప్రపంచంలో ఇంత వరకు ఎవరూ సేకరించలేని విలువైన సమాచారాన్ని అందిస్తుందని ఇస్రో పూర్వపు శాస్త్రవేత్త, తిరువనంత పురంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ సీనియర్ ప్రొఫెసర్ రిజిస్టర్ డాక్టర్ వైవిఎన్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకులతో ఆయన మాట్లాడారు. చంద్రయాన్ 3 హైడ్రాక్స్ మలిక్యుల్స్ వంటి ఎంతో విలువైన సమాచారాన్ని అందించిందని వెల్లడించారు. ఇటువంటి సమాచారం ఇంతవరకు ప్రపంచంలో ఏ దేశంలో సేకరించలేదని ఆయన వివరించారు. చంద్రయాన్ 2 కూడా 25 సెంటీ మీటర్ల రిజల్యూషన్‌లో మూన్‌ను మ్యాప్ చేసి పంపిస్తుందని చెప్పారు. ప్రధానంగా ఉష్ణోగ్రతల వ్యత్యాసం వంటి సమాచారం చక్కగా అందిస్తున్నాయని పేర్కొన్నారు. కళాశాల స్థాయిలో కూడా స్టార్టప్ ఏకో సిస్టం అభివృద్ధి చేసి అధ్యాపకులు, విద్యార్థులు సాటిలైట్స్ తయారు చేసే విధంగా ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ దేశంలో ప్రతిష్టాకరమైన ఇస్రో శాస్త్రవేత్తగా పనిచేసిన వైవిఆర్ కృష్ణమూర్తి తమ కళాశాలకు వచ్చి విద్యార్థులకు సూచనలు సలహాలు అందించడం స్పేస్ టెక్నాలజీ అభివృద్ధికై అందిస్తున్న సేవలు అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో కళాశాల ఆర్ అండ్ డి డీన్ డాక్టర్ పి ఏ రామకృష్ణంరాజు వివిధ విభాగాల హెడ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌కు ఇటలీ ఆహ్వానం

విశాలాంధ్ర - లింగపాలెం : ఇటలీలోని రోమ్ పట్టణంలో జరిగే అంతర్జాతీయ ఆర్‌సీఎం సంస్థల్లోని విశ్వాసుల సభకు జరిగే ఎన్నికల్లో పాల్గొనేందుకు ధర్మాజీగూడెం ఆర్‌సీఎం మత గురువు జి.ఆనంద్‌కు ఆహ్వానం వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా 24 మంది డెలిగేట్స్‌ను గుర్తించారు. వీరు ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుంటారు. వీరంతా కలిసి సుపీరియర్ జనరల్‌ను ఎన్నుకుంటారు. ఆరేళ్ళపాటు ఈ పదవి ఉంటుంది. ప్రస్తుత సుపీరియర్ జనరల్‌గా ఫిలిప్పియన్ దేశానికి చెందిన జీనస్ రజాక్ కొనసాగుతున్నారు. ఈయన పదవీ కాలం ముగియటంతో ఎన్నిక జరుగుతుంది. ఫాదర్ ఆనంద్ ఈ ఎన్నికల్లో పాల్గొనేందుకు మంగళవారం ఇటలీకి బయలుదేరారు. ఎన్నిక ప్రక్రియ సెప్టెంబరు 1 నుంచి 25 వరకు కొనసాగుతుంది. సుపీరియర్ జనరల్ పదవితోపాటు నలుగురిని కౌన్సిలర్లుగా ఎన్నుకుంటారు. ఈ ఎన్నికలు పోప్ ఫ్రాన్సిసెస్ పర్యవేక్షణలో జరుగుతాయి. ఎంపికైన కమిటీ ప్రపంచ వ్యాప్తంగా సాంఘిక, సామాజిక, సువార్త సేవలు అందిస్తారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తారు. 24 మంది డెలిగేట్స్‌లో ధర్మాజీగూడెం గురువు ఆనంద్‌ను ఎంపిక చేయటంపై సంస్థ సభ్యులు, విశ్వాసులు, స్థానిక ప్రజలు అభినందనలు తెలిపారు.

వేగవంతంగా ఆసుపత్రి నిర్మాణం

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : భీమవరంలో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణం వేగవంతంగా జరుగుతున్నదని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించిన స్లాబ్ పనులను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలోనే ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని అన్నారు. మొదటి విడతగా 50 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని రూ. 10 కోట్ల 15 లక్షల నిధులతో ప్రారంభించడం జరిగిందని, మరో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి సుమారుగా రూ. 30 కోట్ల నిధుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నాబార్డుకు ప్రతిపాదనలు చేయడం జరిగిందన్నారు. ఈ ఆస్పత్రి నిర్మాణం వల్ల భీమవరం నియోజకవర్గ ప్రజలతో పాటుగా జిల్లా ప్రజలకు, ఇటు కృష్ణా జిల్లా ప్రజలకు కూడా మెరుగైన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎండీసీ డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, జడ్పిటీసి కాండ్రేగుల నరసింహా రావు, పిప్పళ్ళ నాని, బొర్రా వాసు, చిగురు పాటి సందీప్, గాదిరాజు తాతరాజు, ముత్యాల బుజ్జి, ఏఎస్‌రాజు, రాట్నాల సత్యనారాయణ, మలవల నాగేంద్ర, గాదిరాజు రామరాజు, కట్టా రవి, చెల్లబోయిన సూర్యప్రకాష్, కొవ్వాడ రాజు, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై దృష్టి పెట్టాలి
ఎమ్మెల్యే వాసుబాబు

విశాలాంధ్ర - గణపవరం: ప్రతి విద్యార్థి విద్యతోపాటు ప్రతిరోజు క్రీడలకు కొంత సమయం కేటాయించాలని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. మంగళవారం గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు స్పోర్ట్స్ కోటలో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు నని అన్నారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ ఆదిరెడ్డి సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి, గ్రామ సర్పంచ్ మూరా అలంకారం, కళాశాల అభివృద్ధి కమిటీ సెక్రటరీ కాకర్ల విష్ణు శ్రీనివాసరావు, నడిపెల్లి శ్రీరామ్, కె. సత్యనారాయణ రాజు, ఎంపీపీ దండు వెంకటరామరాజు (అర్ధవరం రాము), జెడ్పీటీసీ సభ్యులు దేవరపు సోమలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్, వైఎస్ఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

పలు విద్యా సంస్థల్లో తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర -భీమవరం: తెలుగు భాషావారోత్సవాలను పురస్కరించుకుని గిడుగు రామమూర్తి జయంతి మహోత్స వాలను పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆర్.ఆర్.డి.ఎస్. ప్రభుత్వ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో తెలుగు భాషా కోవిదుడు ఎస్.టి.వి.పి.రాజగోపాలాచార్యులను ఘనంగా సత్కరించి, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె.ప్రసూన, తెలుగు హెడ్ డాక్టర్ కాకుమాని శ్రీనివాస్, డాక్టర్ అరవింద్ స్వామి, పి.అమూల్యరావు, విద్యార్థులు పాల్గొన్నారు. డి.ఎన్.ఆర్. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.బి. శాంతకుమారి, వైస్ ప్రిన్సిపాల్ సోమరాజు, పరిపాలనాధికారి పి. రామకృష్ణరాజు, అధ్యాపకులు చెల్లబోయిన రంగారావు, టి.చిట్టిబాబు, యు.శ్రీరామరాజు, డి. ప్రశాంత్ కుమార్. పి . నరసింహారావు. ఆర్. సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు. ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గిడుగు రామమూర్తి జీవితం పై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణంరాజు, హెచ్ఎంలు టి.శ్రీనివాస్,బి.యుగసుధ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ ఏర్పాటు చేయాలి : యుటిఎఫ్

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఉంగుటూరు మండలం నారాయణ పురంలో యుటిఎఫ్ కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు.యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వునుముల రాంబాబు, డాకి జోగినాయుడు మాట్లా డుతూ సి.పి.ఎస్. రద్దు చేసి పాత పెన్షన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. గౌరవ అధ్యక్షులు శీతాల సత్యనారాయణ, ఉపాధ్యక్షురాలు ఆకివీడు వాణి, కోశాధికారి ఆనంద్ అల్లు శ్రీను, పుప్పాల నరసింహారావు,ప్రేమ్ కుమార్, లక్ష్మీ నారాయణ, వర్మ, ఉపేంద్ర పాల్గొన్నారు.

వాతావరణ కాలుష్యంపై అవగాహన

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : వాతావరణ కాలుష్యంపై నిత్యం అవగాహన కలిగి ఉండాలని సంస్కార్ ఫౌండేషన్ అధ్యక్షులు గున్నేశ్వర రావు, సీస్ బ్రైటర్ ఫౌండేషన్ (యు.ఎస్. ఏ) ఫౌండర్ శ్రీరామ్ లు విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటి విష్ణుస్కూలులో విద్యార్థులకు వాతావరణ, కాలుష్యంపై అవగాహన కల్పిస్తూ పిల్లల చేత డ్రాయింగ్ బుక్స్, క్రేయన్స్ ఉచితంగా ఇచ్చి వారిచేత డ్రాయింగ్ వేయించి కాలుష్య నివారణకు ఏ ఏ పదార్థాలు వాడాలో వాడకూడదో అవగాహన కల్పించారు. మొక్కలపెంపకంపై,ప్లాస్టిక్ నివారణపై, కూడా అవగాహన కల్పించారు.

మన ఊరు, మన భాష పట్ల గౌరవం ఉండాలి



విశాలాంధ్ర-తణుకు: ఒక జాతి నాగరికత సంస్కృతి, జీవన విధానం, మన మాతృభాషలోనే ప్రతిబింబిస్తుందని డా.రంకిరెడ్డి రామ్మోహన్ రావు అన్నారు.స్థానిక ఎస్ కే ఎస్ డి మహిళా డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాలలో మంగళవారం గిడుగు రామమూర్తి 260 వ జయంతి సందర్బంగా తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కరటూరి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ రంకి రెడ్డి రామ్మోహనరావు పాల్గొని మాట్లాడారు. మహాభారత రచన జరిగి ఇప్పటికీ వేయి సంవత్సరాలు పూర్తయిందని ఆయన తెలియజేశారు. విశిష్ట అతిథి చిత్తూరు సత్య ఉషారాణి మాట్లాడుతూ మాతృభాష మాట్లాడడానికి సిగ్గుపడకూడదని మన ఊరు, మన భాషా పట్ల గౌరవం ఉండాలని, విద్య నేర్పిన గురువుల పట్ల గౌరవం ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాతృభాషలో మాట్లాడాలని, తెలుగును ఇటాలియన్ ఈస్ట్ గా కొనియాడారని మాతృభాష అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అనంతరం అంతర్జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని పలు పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు పి శివప్రసాద్, ఎస్ సుమ, ఫిజికల్ డైరెక్టర్ ఎం రత్నకుమారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : గ్రాంధిక భాషలో వచనాన్ని ప్రజా వాడుక భాషలోకి తీసుకువచ్చిన తెలుగు భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ మూర్తి పంతులు అని గ్రంథ పాలకు రాలు యు.రాముడు తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయం వద్ద విద్యార్థులతో కలిసి గ్రంథపాలకురాలు యు.రాముడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు 160 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్య వ్యవహార భాషలో ఉన్న అందాన్ని వీలును తెలియజెప్పిన మహనీయుడు ఆంధ్రప్రదేశ్ లో వ్యవహారిక భాష ఉద్యమానికి మూల పురుషుడు గిడుగు రామమూర్తి అని, ఈయన 1863 వ సంవత్సరంలో ఆగస్టు 29వ తేదీన పర్వతంపేటలో జన్మించారని, ఈయన బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది,సాహిత్య వ్యాసాలు,నేటి తెలుగు నివేదిక వంటి పుస్తకాలు రచించారని విద్యార్థినీ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, చదువరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-కాళ్ళ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అని డిసిసిబి చైర్మన్ పీవీఎల్ నరసింహా రాజు అన్నారు. మండలంలోని జువ్వల పాలెం గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పి.వి.ఎల్.న రసింహరాజు పాల్గొని 3 సి.సి.రోడ్ల కు శంకుస్థాపన చేశారు .పెద అమిరం గ్రామంలో గడప-గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఇంటికి తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పార్టీ కార్యాలయంలో నూతనంగా నియమింపబడిన అంగన్వాడీ సహాయకుల నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోమేశ్వరరావు, జడ్.పి.పి.సోమేశ్వరరావు, జవ్వాది సత్యం, రామకృష్ణం రాజు, జాషువా, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ కోసం టీడీపీని గెలిపిద్దాం

విశాలాంధ్ర -కాళ్ళ: భావితరాల భవిష్యత్ కోసం టీడీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టీడీపీ మండలాధ్యక్షుడు జివి నాగేశ్వరరావు అన్నారు. కాళ్ళ మండలం కోపల్లె గ్రామంలో టీడీపీ 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే అన్ని తరగతుల ప్రజలకు న్యాయం జరుగుతుందని వివరించారు. ఈ ప్రభుత్వంలో పెంచిన పన్నులు కట్టలేక పేద, మధ్యతరగతి ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను తెలుసుకోవడంతోపాటు పెరిగిన విద్యుత్ చార్జీలు, గ్యాస్ ధరలు, ఇంటి, చెత్త పన్ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బూడి నాగ మణి, ఉప సర్పంచ్ బూడి వెంకట పత్రాలు,క్లస్టర్ ఇంచార్జి తోట ఫణిబాబు, మహాశక్తి టీము సభ్యులు బోధనపు రత్నకుమారి, కొట్టు ఇందిర, తిరుమలశెట్టి లీలావతి, పోతల పద్మ కుమారి, టిడిపి నాయకులు పుప్పాల బుజ్జి, బూడి సత్యనారాయణ, బాలం బాపూజీ, వీరవల్లి సత్యనారాయణ, నాగరాజు, ఆముదాలపల్లి వీరబ్రహ్మం, మంతెన సుబ్బరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నన్నయలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర - రాజానగరం : తెలుగు జాతి గర్వించదగిన మహానాయకుడు ఎన్టీఆర్ అయితే తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి చేసిన నాయకుడు వైఎస్ఆర్ అని అటువంటి మహా నాయకులిద్దరికి భారతరత్న ఇవ్వాలని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహా రాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు 160వ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు,సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో మండలంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన హంస పురస్కారాలు 2023 వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ తేనెవంటి తెలుగు భాషకు, సంస్కృతికి కృషి చేస్తూ పురస్కారాలు అందుకుంటున్న ప్రముఖులకు శుభాకాంక్షలు తెలిపారు.తెలుగు మహాసభల్లో తాను శ్రీకృష్ణదేవరాయుల వేషం వేసిన అనుభవం ఎప్పటికీ మర్చిపోలేనని గుర్తుచేసారు. విశిష్ట అతిథిగా హాజరైన రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరం అన్నారు. రాజరాజ నరేంద్రుడు పరిపాలించిన రాజమహేంద్రి వేయ్యేళ్ళ చరిత్రను ప్రతిబింబించే విధంగా రాజమహేంద్రవరంలో గొప్ప పండుగను ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తా మన్నారు సభాధ్యక్షులు వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని వివరిస్తూ,వివిధ దేశాలలో తెలుగు భాషకు ఇస్తున్న గౌరవాన్ని వివరించారు. మరో అతిథిగా హాజరైన తెలుగు, సంస్కృత అకాడమీ చైర్ పర్సన్ డాక్టర్ ఎన్. లక్ష్మీపార్వతి మాట్లాడుతూ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్ర విభజన ద్వారా పొందాల్సిన కొన్ని ప్రయోజ నాలను తీసుకువచ్చినట్లు చెప్పారు.తెలుగు వర్సిటీకి సంబంధించిన మరికొన్ని విభజన ప్రయోజనాలు రావాల్సి ఉందన్నారు అనంతరం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, వైసీపీ సిజిసి సభ్యులు జక్కంపూడి విజయలక్ష్మి, ఆచార్య శలాక రఘునాథశర్మ తదితరులు తెలుగు భాషపై ప్రసంగించారు. తొలుత అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. అనంతరం సాహిత్యవేత్త శలాక రఘునాథ శర్మను సన్మానించి జ్ఞాపికను అందజేసి అభినందించారు. వివిధ రంగాల్లో ప్రతిభవంతు లైనవారికి తెలుగు, సంస్కృత అకాడమీ హంస పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కెవిఎన్డి వరప్రసాద్, ఎస్.అబ్దుల్ అజీజ్, అకాడమీ అధికారులు, వర్సిటీ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులుపాల్గొన్నారు.

గణపవరం బాయ్స్ హైస్కూల్ విద్యార్థి జిల్లా స్థాయిలో ప్రతిభ

విశాలాంధ్ర - గణపవరం: జాతీయ క్రీడ దినోత్సవం పురస్కరించుకుని పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి క్రీడా పోటీలు మంగళవారం తణుకు చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాలలో క్రీడా పోటీలు నిర్వహించడం జరిగిందని అందులో గణపవరం బాయ్స్ హై స్కూల్ లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి యశోద కృష్ణ జిల్లా స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించినట్లు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం ఎస్ వి ఎన్ మూర్తి తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో 2కే రన్ అండర్ 17 విభాగంలో కృష్ణ ద్వితీయ స్థానం పొంది మెడల్ సర్టిఫికెట్ సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి హై స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎం పద్మావతి విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఈ విజయాన్ని కారణమైన ఆమెను అభినందించారు. ద్వితీయ స్థానం సాధించిన యశోదకృష్ణను ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. గణపవరం బాయ్స్ హై స్కూల్ లో క్రీడలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధనకు జిఇఆర్ సర్వే దోహదం

విశాలాంధ్ర-ముదినేపల్లి : సంపూర్ణ అక్షరాస్యత సాధనకు జిఇఆర్ సర్వే దోహదపడుతుందని ఎంపీడీవో పి. మల్లేశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వాలంటీర్లు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5 నుండి 18 ఏళ్ల మధ్య వయస్సు గలవారు నిరక్షరాశ్యులు , మధ్యలో చదువు మానేసిన వారు, ఫెయిల్ అయ్యి చదువు నిలుపుదల చేసిన వారిని డ్రాప్ అవుట్ గా గుర్తించి పాఠశాలకు తరలించాలని ఏఇంటిలో నిరక్షరాసులు ఉన్నారనే మాట వినపడకుండా వారి వివరాలు , కారణాలు సేకరించి నివేదిక తయారు చేయాలని దీనిపై ప్రభుత్వం, విద్య శాఖ తగిన ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందన్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ నివేదికను రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు , సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాతృభాషలో మాట్లాడడం గౌరవప్రదం

విశాలాంధ్ర -ముసునూరు: తెలుగుబాషలో మాట్లాడం గౌరవ ప్రదంగా వుంటుందని శ్రీ సాయిగీతాం జలి ప్రిన్సిపాల్ మధుప్రియ అన్నారు. మంగళవారం మండలం లోని ముసునూరు శ్రీ సాయిగీతాంజలి ఇంగ్లీషు మీడియం స్కూల్ లో మాతృబాషా దినోత్సవం వేడుకల్లో భాగంగా మాతృభాషాను వ్యవహారిక భాషగా మార్చిన గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శివకోటియాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫిజియోథెరపి

విశాలాంధ్ర-ముసునూరు: ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ప్రతి రోజు వ్యాయామం చేసినట్లేయితే ఆరోగ్యకరంగా వుంటారని ఫిజియో థెరపిస్టు జి.ప్రశాంత అన్నారు. మంగళవారం మండలంలోని ముసు నూరు మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో భవిత సెంటర్‌లో ఫిజియో థెరఫిస్టు జి.ప్రశాంతి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫిజియోథెరపి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యం.హన్నమణి,ఉపాధ్యాయులు డి.యం. వి.లక్ష్మి నారాయణ, జె.నాగమల్లేశ్వరి, విద్యార్థులు,తల్లిదండ్రులు , పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర-టి నరసాపురం: టి నరసాపురం విజన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం ,జాతీయ క్రీడా దినోత్సవాలను పాఠశాల కరస్పాండెంట్ పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గిడుగు రామమూర్తి, మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టి నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు కె.దుర్గారావు మాట్లాడుతూ గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు భాషను వ్యవహారిక భాషలోకి మార్చాలని కృషి చేసిన మహనీయుడు గిడుగు రామమూర్తి పంతులని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినిలు జి.విజయలక్ష్మి, టి.అరుణ, జి.వరలక్ష్మి, ఎస్తేర్ రాణి, పుష్పావతి, రాజేశ్వరి, రమ్య శ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఔషధ సుగంధ మొక్కలతో నూనె ఉత్పత్తి కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం రూరల్ : తులసి,నిమ్మగడ్డి, గులాబీ, గులాబీ రేకులు పుదీనావంటి ఔషధ, సుగంధ మొక్కలను ఉపయోగించి నూనె ఉత్పత్తి చేసే హైడ్రో డిస్టలరీ కేంద్రంను మంగళవారం డాక్టర్ వైయస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ టీ. జానకి రామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ జానకిరామ్ మాట్లాడుతూ ఔషధ, సుగంధ మొక్కల నుండి నూనె తీసే విధానం రైతులకు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రైతులు ఉద్యానవన పంటలతో పాటు ఔషధ మొక్కల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.నారం నాయుడు, శాస్త్రవేత్తలు అశోక్ బాబు, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ధరలు, నిరుద్యోగం, విద్యుత్ భారాలపై

30 నుంచి సీపీఎం సమరభేరి

విశాలాంధ్ర-కొవ్వూరు : అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ భారాలతో ప్రజలను దోచుకు తింటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 30వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా సమరభేరి పేరుతో ఆందోళన కార్యక్రమం చేపడుతున్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కమిటీ సభ్యులు ఎం. సుందర్ బాబు తెలిపారు. మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుందరబాబు మాట్లాడుతూ భారాలకు వ్యతిరేకంగా జిల్లా అంతట 30,31 తేదీల్లో ప్రచారం, సంతకాల సేకరణ, ఒకటో తేదీన సచివాలయాల్లో అర్జీలు అందిస్తామన్నారు. నాలుగో తేదీన అన్ని మండల కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడతామని పేర్కొన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో గుమ్మాపు దానియేలు, గారపాటి ప్రసన్న కృష్ణ, గారపాటి వెంకట సుబ్బారావు, ఎస్.భగత్, వల్లేపల్లి నరసింహమూర్తి తదితర నాయకులు పాల్గొన్నారు.

జాతర మహోత్సవం

విశాలాంధ్ర - గోకవరం : తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం పెంటపల్లి గ్రామంలో కొలువైన ముత్యాల అమ్మవారి జాతర మహోత్స వాలు అంగరంగవైభవంగా నిర్వహిం చారు. జాతర మహోత్సవంలో భాగంగా నాలుగో రోజు అమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమం కనుల పండుగగా జరిగింది తెలంగాణ జరిగే బోనాల జాతర తీరులో పెంటపల్లి గ్రామంలో బోనాలు జాతర జరిగింది గ్రామంలో భాజ భజంత్రీలతో బాణాసంచాలతో గ్రామంలో ఉన్న భక్తులు సుమారు 500 మంది మహిళలు బోనాలు ఎత్తి గ్రామంలో ఊరేగింపుగావెళ్లి అమ్మవారికి బోనాలు కనుక సమర్పించారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆక్ట్ న్యూస్ తో మాట్లాడారు... ప్రతి సంవత్సరం తెలంగాణ తరహాలో ముత్యాల అమ్మవారి జాతర గ్రామ ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.

మానవత సహాయం

విశాలాంధ్ర -తాళ్లపూడి : పేదవాడి ని ఆపదలో ఆదుకునేందుకు తమ వంతు ఎన్నడూ సహాయం చేస్తూనే వుంటామని తాళ్లపూడి మండల మానవత సేవ సంస్థ అధ్యక్షులు సాయిన చిన సుబ్బారావు పేర్కొన్నారు. పెద్దేవం గ్రామంలో, రెండు కిడ్నీలు పోగొట్టుకొని మంచాన పడి ఉన్న ముదునూరు పోసియ్యకు అప్పటికప్పుడు వెంటనే మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు స్పందించి వారి ఉదారతను చాటుకున్నారు. ఈసీ మెంబర్ ఇంజరపు వెంకటకృష్ణ సత్యనారాయణ, కన్వీనర్ గెద్దం సాయిబాబా, ఈసీ మెంబెర్ సనపల రాజశేఖర్, రీజనల్ చైర్మన్ చంద్రయ్య, ఈసీ మెంబర్ ఇంజరపు వెంకటకృష్ణ, సత్యనారాయణ తదితరులు కలిసి పోసియ్య మందులు ఖర్చు, అనారోగ్య ఖర్చులు నిమిత్తం మేరకు అందజేసి వారి మానవతా దృక్పథం చాటుకున్నారు.

తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర - అనపర్తి : వ్యావహారిక భాష అనగానే మనకు ముందుగా గుర్తు కొచ్చేది గిడుగు రామ్మూర్తి అని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాల యంలో గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నల్లమిల్లి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు తమలంపూడి సుధాకర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకటరామారెడ్డి, జిల్లా సాంస్కృతిక విభాగ అధ్యక్షులు సత్తి దేవదాన రెడ్డి,రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ఒంటిమి సూర్యప్రకాష్, మాజీ ఎంపీటీసీ ఓగిరెడ్డి రాధ, సత్యనారాయణ రెడ్డి, బాబురావు,భాసి తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రను చూసి అధికార పార్టీకి ముచ్చెమటలు

విశాలాంధ్ర-కొవ్వూరు : తెలుగు దేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగలం పాదయాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి అధికార పక్షానికి చెమటలు పడుతున్నాయని కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ నాయకులు జొన్నలగడ్డ చౌదరి, కంటమని రామకృష్ణులు పేర్కొన్నారు. మంగళవారం చింతలపూడిలో పాదయాత్ర చేస్తున్న లోకేష్ ను వీరిద్దరితోపాటు పలువురు నాయకులు కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా లోకేష్ కొవ్వూరు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని ఆరా తీశారు. నియోజవర్గంలో జరుగుతున్న పార్టీ కార్యకలాపాలు గురించి నాయకులు వివరించారు. వచ్చే నెల ఒకటి నుంచి పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు 45 రోజులు నిర్వహించాల్సిన కార్యక్రమాలను విజయవంతం చేయాలని లోకేష్ సూచించారని తెదేపా నాయకులు తెలిపారు.

వికాస్ పాఠశాల గుర్తింపు రద్దు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: పట్టణంలోని వికాస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల (1-7తరగతులు) గుర్తింపును జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి రద్దు చేసినట్లు మండల విద్యాశాఖాధికారులు బి.రాముడు, జి.రాములు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వికాస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల యాజమాన్యానికి నోటీసులు అందజేసినట్లు వారు తెలిపారు.ఇటీవల పాఠశాల యాజమాన్యం టిసిలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారని,ఆ ఫిర్యాదు పై జిల్లా విద్యాశాఖాధికారులు సమగ్ర విచారణ జరిపి ఇచ్చిన రిపోర్టు ఆధారంగా జిల్లా కలెక్టర్ పాఠశాల రద్దుకు ఆదేశించినట్లు తెలిపారు.

తెలుగు భాషను ప్రోత్సహిద్దాం

విశాలాంధ్ర - సామర్లకోట : తెలుగు భాషలో పట్టు సాధించడం ద్వారా మిగతా భాషల్లో సాధన సులభమవుతుంది అని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ అన్నారు. మంగళ వారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మునిసిపల్ హైస్కూల్‌లో సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ జీవిత విశేషాలు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు భాషలో వ్యాస రచన, పద్య పఠనం, తెలుగు సామెతలు, క్విజ్ వంటి పోటీలు నిర్వహించారు. రన్నింగ్, మ్యూజికల్ చైర్స్, కబడ్డీ వంటి పోటీలు నిర్వహించారు. తొలుత ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్, తెలుగు తల్లి చిత్ర పటాలకు పుష్ప మాలలతో నమస్కరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం, తెలుగు పండితులు బి. శ్రీలక్ష్మి, జి. బేబీ రాణిలను పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీచర్లు వి. రాజు, జి గోవిందు, కే అరుణ, ఏ ఎల్వి కుమారి, బి. శ్రీలక్ష్మి, జి. బేబీ రాణి, తాళ్లూరి వైకుంఠం, కే. శ్రీనివాస్, జి. బాల శైలజ, పి. బ్రహ్మానందం, జి. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు తప్పనిసరి

విశాలాంధ్ర - సీతానగరం: మానసిక ఉల్లాసానికి క్రీడలు తప్పనిసరి అని మండల విద్యాధికారి స్వామి నాయక్ అన్నారు. మండలంలో సీతానగరం గ్రామంలో గల పువ్వాడ అచ్చమాంబ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వామి నాయక్ మేజర్ ధ్యాన్ చంద్ చిత్ర పటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి స్వామి నాయక్ మాట్లాడుతూ ధ్యాన్ చంద్ చేసిన మంచి పనుల గురించి కొనియాడారు. అలాగే ప్రతీ ఒక్క విద్యార్థి క్రీడలు పట్ల మక్కువ చూపించ మానసిక ఉల్లాసానికి పొందాలని తద్వారా విద్యలో కూడా ముందడుగు వేస్తారని అన్నారు. అనంతరం పి డిగా పని చేసి ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎమ్ వీరభద్రరావు, పి డి సింహాంద్రిని శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. విద్యార్థులు ర్యాలీ చేసి క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుల కె సతీష్ బాబు, పి డి వీరబాబు, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, శ్రీలక్ష్మి, మొదలగు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమాలకు సహకరించిన అధికారులకు శిక్ష తప్పదు

విశాలాంధ్ర - సీతానగరం: ఇసుక అక్రమాలకు సహకరించిన అధికారులకు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే శిక్ష తప్పదు అని రాజానగరం నియోజక వర్గ టిడిపి ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. మంగళవారం టీడీపీ ప్రభుత్వం చేపట్టిన ఇసుక సత్యాగ్రహంలో భాగంగా ఇసుక అక్రమాలను అరికట్టి చర్యలు తీసుకోవాలని ఎస్ఐ చిరంజీవి, తహసీల్దారు సత్యనారాయణ రాజులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటరీ తెలుగు యువత అధ్యక్షుడు కందుల బాబు రాయుడు, చుట్టూరి రంగారావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండపంలో భవిష్యత్‌కు గ్యారంటీ ప్రచారం

విశాలాంధ్ర - శంఖవరం : తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహాశక్తి పథకాలు ప్రచార కార్యక్రమం ప్రత్తిపాడు తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్ వరుపుల సత్య ప్రభ రాజా పిలుపు మేరకు సోమవారం శంఖవరం మండలం మండపం గ్రామంలో నియోజకవర్గ టిడిపి మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన మహిళలు మండల నాయకులతో కలిసి గ్రామంలో మహాశక్తి పథకాలు ప్రచారం చేశారు. ఇంటింటికి కర పత్రాలు పంచుతూ మహిళలు పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు ఏఎంసీ మాజీ డైరెక్టర్ పోలం చిన్నా, గొల గాని రాజ్ కుమార్, నక్కా నాగేశ్వరరావు, వార్డు మెంబర్ కామిరెడ్డి నల్లయ్య, మానుకొండ యతిమాని అధిక సంఖ్యలో మహిళలు, టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : క్రీడల పట్ల ఆసక్తి చూపుతున్న విద్యార్థులకు వాకర్స్ క్లబ్ అందిస్తున్న సేవలు మరువలేనివని ఉప్పాడ కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అన్నారు. ప్రపంచ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళ వారం ఇటీవల కాకినాడ స్పోర్ట్స్ క్లబ్లో నిర్వహించిన హాకీ ఆటలో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ సభ్యులను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా ఆహ్వానించి వాకర్స్ క్లబ్ సభ్యులు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు కొప్పూరి విజయను ఉపాధ్యాయులు శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ సభ్యులు సహకరించడంతో విద్యార్థులకు టీ షర్ట్స్, షూస్‌తో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని వాకర్స్ క్లబ్ సహకారం అన్నివేళలా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు చూడిశెట్టి సతీష్ ఇచ్చిన సలహాలు మేరకు రానున్న రోజుల్లో మరిన్ని విద్యార్థులకు ఆట వస్తువులు అందడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు బంధన మణికంఠ, జగన్, బొబ్బిలి అర్జున్ కుమార్, స్పోర్ట్స్ అధ్యక్షుడు డానియల్, పలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూమియన్ బుకింగ్‌లు ప్రారంభించిన టీకేఎం

విశాలాంధ్ర-భీమవరం: టయోటా కిర్లోస్కర్ మోటర్ (టీకేఎం), ఈరోజు అధికారికంగా బుకింగ్‌ల ప్రారంభాన్ని , దాని తాజా ఆఫర్ పూర్తి సరికొత్త టొయోటా రూమియన్ ధరలను ప్రకటించింది. దీనిని ఆగస్ట్ నెల ప్రారంభంలో విడుదల చేశామని టీ కే ఎం సేల్స్ స్ట్రాటజిక్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ చెప్పారు. ఇది వినియోగదారుల నడుమ పూర్తి ఉత్సాహాన్ని కలిగిస్తుంది. ఆరు గ్రేడ్‌లలో అందుబాటులో ఉన్న ఈ అసాధారణమైన కొత్త కాంపాక్ట్ బీ ఎంపీవీ దాని సాటిలేని స్థలం సౌకర్యం, అద్భుతమైన ఇంధన సామర్థ్యం, ఆకర్షణీయమైన ప్రీమియం బాహ్య డిజైన్‌తో కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తుందన్నారు. టీకేఎం యొక్క తాజా ఆఫర్ ఆకర్షణీయమైన ఎక్స్-షోరూమ్ ధరలలో రూ.10,29,000నుండి రూ. 13,68,000లో లభిస్తుందని, దీని డెలివరీలు సెప్టెంబర్ 8 నుండి ప్రారంభమవుతాయన్నారు. ఈ 7-సీటర్ ఎంపీవీ నియో డ్రైవ్ (ఐ ఎస్ జీ) టెక్నాలజీ మరియు ఈ-సీ ఎన్ జీ టెక్నాలజీని కలిగి ఉండటం తో పాటుగా 1.5-లీటర్ కే సిరీస్ పెట్రోల్ ఇంజన్‌తో శక్తివంతమైనదని తెలిపారు.

రాజమహేంద్రవరంలో అసుస్ స్టోర్ ఏర్పాటు

విశాలాంధ్ర- రాజమండ్రి : దేశవ్యాప్తంగా బ్రాండ్ యొక్క వాణిజ్య కార్యకలాపాలను మరింత విస్తరించడంలో భాగంగా తైవనీస్ సాంకేతిక సంస్థ అసుస్ ఇండియా నేడు తమ ప్రత్యేకమైన బ్రాండ్ స్టోర్‌ను రాజమహేంద్రవరం లో ప్రారంభించింది. ఈ నూతన ప్రత్యేకమైన స్టోర్ 295 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండటంతో పాటుగా మొత్తం శ్రేణి ఎలక్ట్రానిక్స్ కంప్యూటర్ హార్డ్‌వేర్ అందుబాటులో ఉంచుతుంది. వీటిలో అసుస్ ప్రతిష్టాత్మకమైన ఉత్పత్తులు అయినటువంటి వివోబుక్, జెన్‌బుక్, జెన్‌బుక్ %--%ఫ్లిప్, డెస్క్‌టాప్‌లు, రిపబ్లిక్ ఆఫ్ గేమర్స్ (ఆర్ఓజీ) ల్యాప్‌టాప్స్, గేమింగ్ డెస్క్ టాప్స్ , ఆల్ ఇన్ వన్ డెస్క్ టాప్స్ మరియు యాక్ససరీలు అందుబాటులో ఉంటాయి. రాజమహేంద్రవరం లో బ్రాండ్ కు ఇది మొట్టమొదటి ఎక్సక్లూజివ్ స్టోర్. దీనితో ఆంధ్ర ప్రదేశ్ లో అసుస్ స్టోర్ ల సంఖ్య 6 కు చేరింది.ఈ విస్తరణ గురించి జిగ్నేష్ భవసార్, నేషనల్ సేల్స్ మేనేజర్ , అసుస్ ఇండియా మాట్లాడుతూ "భారతదేశంలో మా వాణిజ్య కార్యకలాపాలు విస్తరిస్తున్నామని వెల్లడిస్తుండటం పట్ల చాలా సంతోషంగా ఉన్నామన్నారు.

శ్రీఅభయాంజనేయ స్వామి దేవస్థానంలో అన్నదానం

విశాలాంధ్ర - పెదపాడు: మండలం అప్పన వీడు గ్రామంలో వేంచేసియున్న శ్రీఅభయ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో మంగళవారం 200 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గ ప్రసాద్, కనుమూరి సూర్యనారాయణ రాజు (చిన్న రాజు), చైర్మన్ నెర్సు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ సేవాసమితి వారు సిబ్బంది పాల్గొన్నారు. రాగిపిండి రామచంద్రారెడ్డి వారి కుమారుడు అంకిత్ రెడ్డి సౌజన్యంతో మంగళవారం అన్నదానం కార్యక్రమం జరిగింది.